క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు ఆటంకం

రాయచోటి అర్బన్ : నక్కావాండ్లపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగుతుందని రాయచోటి పట్టణం తూర్పు విభాగం ట్రాన్స్‌కో ఏఈ సయ్యద్‌పీరా తెలిపారు. రాయచోటి– సుండుపల్లె మార్గంలో రవి థియేటర్ వద్ద నుంచి రింగురోడ్డు వరకు రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయన్నారు. పనులలో భాగంగా రోడ్డుకడ్డంగా ఉన్న స్తంభాల తొలగింపు కోసం నక్కావాండ్లపల్లె విద్యుత్‌సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు. రవి థియేటర్ వద్ద నుంచి రాజులకాలనీ, రెడ్డీస్‌కాలనీ, మిషన్లమిట్ట, చెన్నముక్కపల్లె, కుమ్మరపల్లెలకు ప్రతి రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వీలైనంతవరకు పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు సహకరించాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు.

భారీ మెజార్టీ ఖాయం

గాలివీడు : వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి భారీ మెజార్టీతో విజయం ఖాయమని ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపీపీ యదుభూషన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల నాగభూషణ్ రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్‌మొహిద్దీన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని సీఎం జగన్ మోహన్ రెడ్డికి మద్దతుగా నిలవడంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి కృషి చేసిన పోలీసులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబు


సాయినాథుడి ఆలయం

రాయచోటి టౌన్ : నేడు రాయచోటి ఎస్ఎన్ కాలనీలోని షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ పాలక మండలి నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 6:30 గంటల హారతి నిర్వహించిన తరువాత పల్లకీ ఉత్సవం నిర్వహిస్తామని, భక్తులు విశేషంగా పాల్గొనాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బయారెడ్డి తెలిపారు.

ఘనంగా సత్యమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట


అన్నదానం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చింతల, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి

వాల్మీకిపురం : మండలంలోని గండబోయనపల్లి పురాతన కోట ప్రాంగణంలో ఎండోమెంట్, గ్రామస్తుల సహకారంతో పునఃనిర్మించిన సత్యమ్మ తల్లి ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కనుల పండువగా సాగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీపీ అరుణమ్మ, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గండబోయనపల్లితో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రప్ప, నాయకులు శీనా, రాజన్న, సత్తిపండు, క్రిష్ణాంజనేయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ట


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రంలోని విద్యుత్ స్టేషన్ వద్ద వెలసిన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం గ్రామస్తులు నూతన విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం గణపతి పూజ, గోవు పూజ, హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

నేటి నుంచి గంగ జాతర

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో మంగళ, బుధవారం గంగమ్మ, గౌరమ్మల జాతర నిర్వహించనున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఎప్పటిలాగే జాతరలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

పట్టభద్రులు.. బారులు తీరారు

- ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు
- ఎండను సైతం లెక్కచేయని పట్టభద్రులు
- రైల్వేకోడూరులో ఓటు హక్కు వినియోగించిన ప్రభుత్వ విప్ కొరముట్ల


సంబేపల్లె: పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు


సిద్దవటం: పోలింగ్‌పై సమీక్షిస్తున్న జెడ్పీ చైర్మన్


సిద్దవటం: ఓటింగ్‌కు క్యూలైన్‌లో పట్టభద్రులు


రాజంపేట: పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి క్యూ కట్టిన పట్టభద్రులు


రామాపురం: తల్లి ఓటు వేయడానికి వెళ్లడంతో చిన్నారిని ఎత్తుకున్న కానిస్టేబుల్


ఓబులవారిపల్లె: పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన పట్టభద్రులు

రాజంపేట : రాజంపేట నియోజకర్గంలో పెద్దల ఎన్నికల పోరు ప్రశాంతంగా ముగిసింది. అధికారులు ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు జరిగాయి. రాజంపేట నియోజకవర్గంలో రాజంపేట, నందలూరు, వీరబల్లి, సుండుపల్లె, ఒంటిమిట్ట, నందలూరు మండలాల్లో పట్టభద్రులు 8523, ఉపాధ్యాయులు 707గా ఉన్నారు. పట్టభద్రులకు 5417 మంది, ఉపాధ్యాయులు 652 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజంపేట డివిజన్‌లో 9మండలాలకు సంబంధించి 71.89 శాతం, ఉపాధ్యాయులు 93.17 శాతం పోలింగ్ కొనసాగింది. సబ్ కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్‌రూంకు బ్యాలెట్ బాక్సులను తరలించారు. అక్కడి నుంచి అనంతపురానికి తరలించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

పోలింగ్ సరళి పరిశీలన

పోలింగ్ సరళిని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు పరిశీలించారు. నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటింగ్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులతోపాటు సౌమ్యనాథ ఆలయ మాజీ చైర్మన్ సౌమిత్రి ఉన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లి : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. లక్కిరెడ్డిపల్లె మండలంలో పట్టభద్రులు ఓటర్లు 747 మందికి 596, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 46కి 45 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. 90 ఏళ్ళపైబడి వృద్ధులు కూడా తమ గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చారు.

వీరబల్లిలో..

వీరబల్లి : మండల కేంద్రంలోని వీరబల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండల పరిధిలో గ్రాడ్యుయేట్స్ 980 ఉండగా 705 ఓట్లు పోలయ్యాయి. అదే విధంగా ఉపాధ్యాయ ఓటర్లు 55 ఉండగా 48 పోలయ్యాయి.

గాలివీడులో 78శాతం పోలింగ్

గాలివీడు : ఎమ్మెల్సీ ఎన్నికలలో గాలివీడులో పట్టభద్రులు 78శాతం పోలింగ్ కాగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో 97శాతం ఓట్లు పోలైనట్లు పోలింగ్ ఆఫీసర్ ఇషానుల్లా పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఎన్నికలకు ఎస్ఐ వెంకట శివకుమార్ బందోబస్తును ఏర్పాటు చేశారు. తహసీల్దార్ దైవాదీనం, ఎంపీడీఓ శేఖర్ నాయక్‌లు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలలో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : మండలంలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు సంబంధించి 88 ఓట్లకుగాను 84 ఓట్లు పోలయ్యాయి. పట్టభద్రులకు సంబంధించి 922 ఓట్లకు గాను 680 పోలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సలహాదారులు ఎస్ చంద్రశేఖర్ రెడ్డి తమ ఓటును వినియోగించుకున్నారు. అలాగే జెడ్పీటీసీ రామనాథం, దార్ల గీతాదేవిలు తమ ఓట్లను వినియోగించుకున్నారు. ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చిట్వేలిలో..

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. తహసీల్దార్ మురళీకృష్ణ పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్య, చిట్వేలి ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ వారి సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పోలింగ్‌ను ప్రశాంతంగా జరిపించారు. 771 మంది పట్టభద్రులకుగాను 577 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే 46 మంది ఉపాధ్యాయ ఓటర్లకుగాను 44 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

పెనగలూరులో..

పెనగలూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం మందకొడిగా పోలింగ్ సాగింది. 11గంటల సమయంలో పట్టభద్రులు భారీగా క్యూలో నిలబడ్డారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 41 ఓట్లు ఉండగా 38 (93శాతం) ఓట్లు పోలయ్యాయి. అలాగే పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలలో మండల వ్యాప్తంగా 847 ఓట్లకుగాను 589 (70శాతం) ఓట్లు పోలయ్యాయి. సీఐ పుల్లయ్య, ఎస్ఐ హేమాద్రిల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహించారు.

ఎన్నికల సరళిని పరిశీలించిన అజయ్‌రెడ్డి

రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి ఎన్నికల సరళిని పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసి అత్యధిక శాతం పోలింగ్ జరిగేలా వారికి సూచనలు ఇచ్చారు. తహసీల్దార్ శ్రీధర్‌రావు పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించారు.

సుండుపల్లెలో..

సుండుపల్లె (వీరబల్లి) : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సుండుపల్లె మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1176 ఉండగా 861 మంది వినియోగించుకున్నారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు 83 ఉండగా 80 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నందలూరులో..

నందలూరు(రాజంపేట) : నందలూరులో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈయన వెంట తిరుపతి ఎమ్మెల్యే సోదరుడు భూమన శంకర్‌రెడి, జెడ్పీటీసీ గడికోట వెంకటసుబ్బారెడ్డి, సర్పంచి సూర్యనారాయణ తదితరులున్నారు. 947 పట్టభద్రులకు గాను 704 ఓట్లు పడ్డాయి. 75 ఉపాధ్యాయులకుగాను 65 ఓట్లు పడ్డాయి. తహసీల్దారు ఉదయశంకర్‌రాజు, ఎంపీడీఓ సౌభాగ్యలు పోలింగ్ కేంద్రం వద్ద దగ్గరుండి ప్రక్రియను నిర్వహించారు. రాజంపేట టౌన్ ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును నిర్వహించారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : మండలంలోని పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తహసీల్దారు శ్రీనివాసులరెడ్డి ఎస్ఐ మధుసూదన్‌రావుల ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పట్టభద్రుల ఓట్లు 820 ఓట్లకు గాను 644 ఓట్లు పోలు కాగా, పోలింగ్ 78.56 శాతంగా నమోదైంది. ఉపాధ్యాయుల ఓట్లు 22 ఉండగా 22 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో వంద శాతం పోలింగ్ నమోదైంది. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ ప్రధాన నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో సోమవారం జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ కేంద్రాన్ని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఉపాధ్యాయ ఓటర్లు 34 ఉండగా 33 పోల్ అయ్యాయి. పట్టభద్రులు 688 మంది ఉండగా 546 ఓట్లు పోలయ్యాయి. 97 శాతం ఉపాధ్యాయుల ఓట్లు. 79 శాతం పట్టభద్రుల ఓట్లు నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : పట్టభద్ర, ఉపాధ్యాయ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 858 పట్టభద్ర ఓట్లు, ఉపాధ్యాయుల 40 ఓట్లు ఉన్నాయి. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పట్టభద్ర, ఉపాధ్యాయ ఓటింగ్‌కు పోలింగ్ బూత్‌లను విడివిడిగా ఏర్పాటు చేశారు. పట్టభద్ర ఓట్లు 694, ఉపాధ్యాయులవి 38 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు : పట్టణంలోని హెచ్ఎమ్ఎమ్ హైస్కూల్‌లో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం సాయంత్రం ముగిసింది. పట్టభద్రుల ఓట్లు 1945 కిగాను 1432 ఓట్లు పోలై, 73.6 శాతం నమోదైంది. అలాగే ఉపాధ్యాయుల ఓట్లు 230 కిగాను 225 ఓట్లు పోలై, 97.8 శాతం నమోదైంది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ సాయంత్రం 5.45 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు మధ్య ఈ ఎన్నికలు జరిగాయి. ఈ నెల 16వ తేదీన ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ జరగనుంది. అలాగే గ్రాడ్యుయేట్ ఓటు హక్కును ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు వినియోగించుకున్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అధికారిణి తహసీల్దార్ పీర్ మున్నీ ఎన్నికలను పర్యవేక్షించారు. నోడల్ అధికారి నరసింహ మూర్తి పోలింగ్ బూత్‌లలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. రాజంపేట డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి, రైల్వేకోడూరు సీఐ విశ్వనాథరెడ్డి పోలింగ్ కేంద్రాలు పరిసరాలను పరిశీలించి శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. 73శాతం ఓటింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారిణి పీర్ మున్నీ తెలిపారు. మొత్తం మండల వ్యాప్తంగా 1450 పట్టభద్రుల ఓట్లకుగాను 1061 ఓట్లు పోలయ్యాయని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకిగాను 98 ఓట్లకు 85 ఓట్లు పోలయ్యాయని 83.73శాతం పోలింగ్ జరిగిందని అధికారులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఇక్కడి పాఠశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు బూత్ నెంబర్ 85లో జరుగగా ఉపాధ్యాయుల ఎన్నికలు బూత్ నెంబర్ 37లో జరిగాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 940 ఓట్లుగాను 742 ఓట్లు పోల్ కాగా 78.05 శాతం నమోదైందని పీఓ సీతారాం, ఏపీఓ ప్రతాప్‌లు తెలిపారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 51 ఓట్లకు గాను 49 ఓట్లు పోల్ కాగా 96.08 శాతం నమోదైనట్లు పీఓ కె. వీరశేఖర్, ఏపీఓ ముంతాజ్‌బేగంలు తెలిపారు.


రాజంపేట టౌన్: ఓటు వేస్తున్న పోలా


రైల్వేకోడూరు: క్యూలైన్‌లో ఓటర్లు


చిన్నమండెం: వృద్ధుడికి సహాయం చేస్తున్న పోలీసు

రామాపురంలో..

రామాపురం : పశ్చిమ రాయలసీమ శాసనమండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు సోమవారం జరిగిన ఎన్నికలు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని ఆర్సీఎం చర్చి పాఠశాలలో పట్టభద్రుల 107 పోలింగ్ కేంద్రంలో 730 ఓట్లకు గాను 613 మంది పట్టభద్రులు తమ ఓటు వేయగా, 83.97శాతంగా పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రం నెంబరు 53లో 42 ఓట్లకు గాను 38 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 90.47శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని సీఐ వరప్రసాద్‌కు రామాపురం ఎస్ఐ కొండారెడ్డిలకు ఆదేశించారు. అనంతరం డీఎస్పీ శ్రీధర్‌బాబు ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఓ మహిళ ఓటును వినియోగించుకోవడానికి తన బిడ్డతో రావడంతో బిడ్డ సహకరించకపోవడంతో ఆ పిల్లవాడిని చేరదీసి ఆ మహిళ ఓటు వేసుకోవడానికి సహకరించిన కానిస్టేబుల్ రవీంద్రరాజును ఓటర్లు ప్రశంసించారు. ఓటు అనంతరం మహిళ సదరు కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలను తెలియజేశారు.


పెనగలూరు: క్యూలైన్‌లో పట్టభద్రులు



ఒంటిమిట్ట: ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మేడా


చిట్వేలి: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రం వద్ద...


సంబేపల్లె: చంటిబిడ్డతో క్యూలైన్‌లో తల్లి

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న మావులూరి విశ్వనాథ

రాయచోటి అర్బన్ : అఖిల భారత రైతుకూలీ సంఘం రాయచోటి మండల నేతలు ఎం.వెంకటచలపతి, కదిరప్పలపై దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అన్నమయ్య జిల్లా నేత మావులూరి విశ్వనాథ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఏపీ రైతు కూలీ సంఘం నేతలతో కలసి దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్‌ను వినియోగించుకునే విషయంలో కాటినేనివాండ్లపల్లెకు చెందిన మెరుగు వెంకటాచలపతి, కదిరప్పలు, మెరుగురామక్రిష్ణ, వెంకటరమణలు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ జరుగుతుండగా పథకం ప్రకారం అదే గ్రామానికి చెందిన కాటినేని చిన్నమల్లప్ప, అక్కుమల్లమ్మతోపాటు మరో 9మంది దౌర్జన్యం చేస్తూ కత్తులు, కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. పోలీసులు వెంటనే దాడికారకులను కఠినంగా శిక్షించి మరోమారు ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మండల ఏపీ రైతు కూలీ సంఘం నేతలు పూసపాటి రమణ, పెద్దినాయుడు, రఘునాథ్‌తోపాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సెమీఫైనల్స్‌లో విజయం వైఎస్సార్‌సీపీదే

– ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు


మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : ప్రస్తుతం జరిగిన ఈ ఎన్నికలు రాష్ట్రంలో సెమీఫైనల్స్ అని 2024లో జరగనున్న ఫైనల్స్‌లో తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ చూడాలని ఈ రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని హెచ్ఎమ్ఎమ్ హైస్కూల్‌లో తన గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం విలేకర్లతో ఎమ్మెల్యే కొరముట్ల మాట్లాడుతూ ఎప్పుడూ లేనివిధంగా గ్రాడ్యుయేట్లతో పాటు ప్రవేటు టీచర్లను ఈ ప్రభుత్వం గుర్తించి వారి రెప్రజెంటేషన్ చట్టసభల్లోనూ ఉండాలనే ఉద్దేశంతో వారికి ఓటు హక్కు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే 2లక్షల 60వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, మార్కెట్ కమిటి చైర్మన్ సుబ్బరామరాజు, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, శివయ్య, సిహెచ్.రమేష్, మందల నాగేంద్ర, సుదర్శన్‌రాజు, గునిశెట్టి రమేష్, బందారు మల్లి, ఆర్‌వి.రమణ, రౌఫ్, దార్ల చంద్రశేఖర్, హరిక్రిష్ణా రెడ్డి, రమణారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి గాయపడిన వ్యక్తి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వివరాలు... ఆదివారం రాత్రి పుంగనూరు రోడ్డులోని జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని బుగ్గకాల్వకు చెందిన అనిల్‌కుమార్(26)తో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. బాధితులను స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ మృతి చెందాడు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లెలో సోమవారం జరిగింది. తట్టివారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి భార్య వి.రాధమ్మ(58) వ్యక్తిగత పనులపై పట్టణంలోని వెళ్లి తిరిగి ఆటోలో తట్టివారిపల్లెకు చేరుకుంది.ఇంటికి వెళ్ళేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఆమెను ఢీకొంది. ప్రమాదంలో బాధితురాలు గాయపడగా గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజంపేటలో ఉద్రిక్తత


రాజంపేట గర్ల్స్‌హైస్కూల్ గేటు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న దృశ్యం

రాజంపేట : గర్ల్స్ హైస్కూల్‌లో పోలింగ్ ముగిసే సమయంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు టీడీపీ రాజంపేట ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడు తన వర్గీయులతో రావడంతో లోపలికి ఎలా అనుమతి ఇస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి పోలీసులను ప్రశ్నించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాలకు చెందిన నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు.

నేడు నులిపురుగుల దినోత్సవం

మదనపల్లె సిటీ: డివిజన్ పరిధిలో మంగళవారం జాతీయ నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు ఆలెబెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మి తెలిపారు.

పెద్దల ఎన్నికల్లో విజయం వైఎస్సార్‌సీపీదే

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట/సిద్దవటం : పెద్దలపోరులో విజయం వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులదేనని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మన్నూరు హైస్కూల్ వద్ద విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రనాథరెడ్డికి పట్టభద్రులు అండగా నిలుస్తున్నారన్నారు. అలాగే ఉపాధ్యాయులకు మేలు చేసేందుకు ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉపాధ్యాయులు సంతోషంగా ఉన్నారన్నారు. పట్టభద్రుల విషయానికి వస్తే ప్రతి ఇంటిలో జగనన్న సంక్షేమం తలుపుతట్టిందన్నారు. ముఖ్యమంత్రి తీసుకొచ్చిన నవరత్నాలే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుబాటకు కారణం కానున్నాయన్నారు. రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి బాటను చూపేందుకు పెద్దఎత్తున భారీ పరిశ్రమలును తీసుకొచ్చారన్నారు. జగనన్న రుణం తీర్చుకునేందుకు ఈ ఎన్నికల్లో పట్టభద్రులు భారీగా తరలివచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు

రాయచోటి మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా

రాయచోటి : ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరగడం హర్షణీయమని రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా అన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటిలో ఏర్పాటు చేసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పట్టభద్రులు 76.3 శాతం, ఉపాధ్యాయులు 93.8 శాతం వంతున ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకున్నారని తెలిపారు. పెద్దఎత్తున పోలింగ్ అయ్యేలా వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకుల కృషికి కృతజ్ఞతలు తెలిపారు. అధికార పార్టీ ఉందని, ఎక్కడా అధికార దర్పం అన్నది లేకుండా ప్రజాస్వామ్య విలువలు కాపాడేలా వ్యవహరించడం అభినందనీయమన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలు పోలింగ్ బూత్‌లలో ఏడెనిమిది మంది ఇండిపెండెంట్ అభ్యర్థుల ఏజెంట్లను కూర్చోబెట్టి హంగామా, రెచ్చగొట్టేలా చేసినా కూడా వైఎస్సార్‌సీపీ వారు శాంతియుతంగా పోలింగ్ జరిపేందుకు సహకరించారన్నారు. రాయచోటిలోని పోలింగ్ కేంద్రంలో టిడిపి వారే దౌర్జన్యాలకు పాల్పడ్డారని, అలాగే గాలివీడులో వైఎస్సార్‌సీపీ ఏజెంట్ చొక్కాను ఒక టీడీపీ నాయకుడు పట్టుకోవడమే కాకుండా తిరిగి వైఎస్సార్‌సీపీ వారిపైనే దౌర్జన్యం చేశారని ఆరోపించారు. పోలింగ్ బూత్‌ల సమీపంలో ఉండకూడదని తెలిసి కూడా మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి పట్టణంలో పోలింగ్ బూత్‌ల దగ్గరే ఉండి కార్యకర్తలను రెచ్చగొట్టి పంపించడం శోచనీయమన్నారు.

భవానీనగర్‌లో చోరీ

మదనపల్లె : భవానీనగర్‌లో చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు భవానీనగర్‌లో నివాసమున్న మనోజ్‌కుమార్‌రెడ్డి రెండు రోజుల క్రితం బంధువుల వివాహానికి ఊరికి వెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి ఉండటం గమనించారు. ఇంటిని పరిశీలించి చోరీ జరిగినట్లు గుర్తించిపోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.1.50 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, ఒక ల్యాప్‌టాప్ చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.